క్లుప్తంగా

అరుణాచలం గిరి ప్రదర్శనకు కోదాడ నుంచి ఆర్టీసీ బస్సు

కోదాడఅర్బన్ : కోదాడ డిపో నుంచి పౌర్ణమికి తమిళనాడులోని అరుణాచలేశ్వరుని గిరి ప్రదర్శనకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష మంగళవారం తెలిపారు. ఈ నెల 25వ తేదీన (సోమవారం) ఉదయం 6గంటలకు కోదాడ డిపో నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, అరుణాచలం వెళ్లి తిరుగు ప్రయాణంలో వేలూరు గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని 27వ తేదీ ఉదయం కోదాడకు చేరుకుంటుందని తెలిపారు. బుకింగ్ ప్రారంభమైందని, ఆసక్తి గల వారు సీటు రిజర్వేషన్ చేసుకోగలరని తెలిపారు. ఒక్కరికి చార్జి రూ.3,500లు ఉంటుందని, వివరాలకు కోదాడ డిపోకు చెందిన సెల్ నంబర్లు 7382833498, 9573953143 లను సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యార్థికి గాయాలైన ఘటనపై ఎంఈఓ విచారణ

మోతె : మండలంలోని రాఘవాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థికి గాయాలైన ఘటనపై డీఈఓ అశోక్ ఆదేశాలతో మంగళవారం ఎంఈఓ కె.గోపాల్‌రావు విచారణ జరిపారు. విద్యార్థితో పాటు వారి కుటుంబసభ్యులు, గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనకు కారకుడైన ప్రధానోపాధ్యాయుడిని ఆ బాధ్యతల నుంచి తొలగించినట్లు ఎంఈఓ తెలి పారు. మరో ఉపాధ్యాయుడికి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొ న్నారు. విచారణ జరిపిన నివేదికను ఉన్నతధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ ఆనందకుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు జారీ

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు : చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో పలువురు అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం వహిస్తున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని దరఖాస్తుదారులు ఆరోపిస్తుండడంపై మంగళవారం సాక్షిలో 'సమన్వయం లేక.. సంతకాలు చేయక' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ కార్యాలయం అధికారులు స్పందించారు. గత 20 రోజుల క్రితం కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్న మాదవరపు కొండలుకు అధికారులు కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. కార్యాలయంలో అధికారులు మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ప్రజల దరఖాస్తులను పరిశీలించి సంబంధిత సర్టిఫికెట్‌లను వెంటనే జారీ చేస్తున్నామని తహసీల్దార్ సరిత సాక్షికి తెలిపారు.

శివాలయం హుండీ లెక్కింపు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీపార్వతీ భీమలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి సీహెచ్. వెంకటనారాయణ సమక్షంలో అధికారులు మంగళవారం లెక్కించారు. కార్తీక మాసంతో కలిపి 4 నెలల ఆదాయం రూ.81,370లు వచ్చినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమర్‌గౌడ్, ధర్మకర్తలు శ్రీనివాసాచారి, రాజు, పుష్పలత, జి.రమేష్, పి.అశోక్, సురేష్, అర్చకులు రెంటాల రవిశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, సిబ్బంది శ్రీనివాసరావు, సీత, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, పాస్టర్ జె.జె.సామ్యూల్‌సన్ తన పుట్టినరోజును పురస్కరించుకొని, అదేవిధంగా క్రిస్మస్ సందర్భంగా కోదాడలోని బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవించే 50 మందికి మంగళవారం దుప్పట్లు, తాగునీటిని తన భార్య ఉషతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామ్యూల్‌సన్ మాట్లాడుతూ నిరాశ్రయులు, భిక్షాటకులు, నిరుపేదలకు సాయం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 3వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ షేక్ షహనాజ్ మంగళవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కౌన్సిలర్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, రణపంగ నాగయ్య, జితేందర్‌రెడ్డి, నాయకులు ఖరీముల్లా, సురేష్‌రెడ్డి, అజయ్, పద్మ, ఖాజావలి, ఇస్తీయాక్, శ్రీను, సైబల్ తదితరులు ఉన్నారు.

పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలని వినతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా హుజూర్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ వాస పల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన నేరేడుచర్ల మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డికి పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణ పనులను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, పావని, లక్ష్మి, మౌలాంబి, రమణ, దుర్గమ్మ, ఫాతిమా, మంగమ్మ, సాజీదా, లక్ష్మమ్మ, శ్యామల తదితరులు ఉన్నారు.

పనుల కోసం కూలీల పాట్లు

- ఆటోలు, ట్రాక్టర్లలో ఇతర గ్రామాలకు తరలివెళ్తున్న మహిళలు
- ఆయకట్టులో తగ్గిన వరిసేద్యం

మునగాల : మండలంలోని సాగర్ ఆయకట్టు గ్రామాల నుంచి ఇతర మండలాల్లో గల నాన్‌ఆయకట్టు గ్రామాలకు వ్యవసాయ కూలీలు పనుల కోసం వెళ్తున్నారు. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతంలో వ్యవసాయ పనులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో జీవనోపాధి నిమిత్తం మండల పరిధిలోని మునగాల, గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి, నారాయణగూడెం, బరాఖత్‌గూడెం తదితర గ్రామాల నుంచి నిత్యం సుమారు మూడు వందల మంది వ్యవసాయ కూలీలు చివ్వెంల మండలం గుంపుల, గుంజలూరు, తిరుమలగిరి, మోతె మండలం నామవరం, హుస్సేనబాద్, మునగాల మండలం రేపాల, నర్సింహులగూడెం గ్రామాలకు ఆటోలు, ట్రాక్టర్లలో వెళ్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పత్తి చేలల్లో కలుపు తీసేందుకు వెళ్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. రోజు కూలి రూ.200లు ఇస్తున్నారని, రానుపోనూ ఆటో చార్జీలు రైతులే బరాయిస్తున్నట్లు తెలిపారు. గత 20 రోజులుగా తమకు ఉపాధి దొరుకుతుందని అంటున్నారు.



మునగాల వద్ద ఆటోల్లో పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు

డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతులపై మొగ్గు

ఇదిలా ఉండగా మండలంలోని ఆయకట్టు గ్రామాల్లో అక్కడక్కడ వరిసేద్యం ప్రారంభమైనప్పటికీ రైతాంగం వరినాట్లకు స్వస్తి పలికి విత్తనాలు వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్ విధానాన్ని చేపడుతున్నారు. దీంతో ఆయకట్టులో కూలీలకు పని లేకుండా పోయింది. కూలి కోసం ఇతర గ్రామాలకు వెళ్లే కూలీలను తరలించేందుకు ఆటోలు వినియోగిస్తుండడంతో సుమారు 30 ఆటోలకు నిత్యం పని దొరుకుతుందని పలువురు ఆటోడ్రైవర్లు తెలిపారు.

ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం



మా గ్రామం ఆయకట్టు ప్రాంతం. కానీ రైతులు వెదజల్లే పద్ధతితో వరి సాగు చేస్తుండడంతో మాకు కూలి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నాం. ఆటోలు, ట్రాక్టర్ల మీద రోజు పనులను వెళ్లి వస్తున్నాం.

– మిట్టగణుపుల వెంకమ్మ, వ్యవసాయ కూలీ, నారాయణగూడెం

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని ఉత్తమ్‌పద్మావతి నగర్‌లో బాప్టిస్ట్ చర్చి పాస్టర్ వి యేసయ్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని బ్రదర్ జాన్, కవిత దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో నడిగూడెం ఎంపీపీ జ్యోతిమధుబాబు, మున్సిపల్ కోఆప్షన్ క్రిస్టియన్ మైనార్టీ సభ్యురాలు వి.జానకి యేసయ్య, జాన్, కోటయ్య, జగ్గునాయక్, ఆనంద్, లక్ష్మయ్య, లెనిన్, భూమ్‌నాయక్, అశోక్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పాలకవీడుకు రావాలని మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం



ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సుబ్బారావు

పాలకవీడు : ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పాలకవీడు మండల అధ్యక్షుడు ఎస్‌వి. సుబ్బారావు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పాలకవీడు మండలం నుంచి కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ అందించినట్లు ఉత్తమ్‌కు వివరించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల అభీష్టం మేరకు ఒకసారి పాలకవీడు మండలానికి రావాలని మంత్రిని ఆహ్వానించినట్లు చెప్పారు. అందుకు ఉత్తమ్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి వినతి

చిలుకూరు : మండలంలోని బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో చైర్మన్ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆ సంఘం డైరెక్టర్లు పలువురు జిల్లా సహకార సంఘం అధికారి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. సంఘంలోని 13 మంది డైరెక్టర్లకు గాను 9 మంది డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. కాగా, ఈ విషయంపై సాక్షిలో సోమవారం బేతవోలు సొసైటీలో అవిశ్వాస ముసలం అనే శీర్షికతో కథనం వచ్చిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో డైరెక్టర్లు బజ్జూరి రవీందర్‌రెడ్డి, చందా శ్రీనివాస్, మద్ది సుదర్శన్‌రెడ్డి, పండ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అనంతు ప్రమీళాశ్రీనివాస్, గంగయ్య, మరియమ్మ, సోప్లా, సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీ నెమ్మాది సైదిబాబు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్లు

రంగస్థల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ప్రజావాణిలో అధికారులకు వినతి

మఠంపల్లి : ప్రభుత్వం రంగస్థల కళాకారులను ఆదుకోవాలని కోరుతూ నియోజకవర్గ రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికంగా కళాకారులు మాట్లాడుతూ కళాకారులకు పెన్షన్లు, గుర్తింపు కార్డులు, ఉచిత బస్‌పాస్‌లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ.రామారావు, నియోజకవర్గ అధ్యక్షుడు బోనగిరి ప్రకాశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి భద్రయ్యచారి, కోశాధికారి కాసీం, జగ్గయ్య, తామస్‌రెడ్డి, గోవిందరాజు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ఉండాలి

నడిగూడెం : ఓటు నమోదుపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఏఎల్‌ఎంటీ వి.రామారావు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఎలక్టోరియల్ రూల్స్ అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమమాలిని, ఎంపీడీఓ ఇమామ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



నడిగూడెంలో మాట్లాడుతున్న రామారావు

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

మోతె : 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన భారతీయ యువతి, యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాష్‌రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో మంగళవారం నల్లగొండ మాజీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ. 4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు సభ్యులు బట్టిపెల్లి సైదులు, వెంపల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బట్టిపెల్లి నాగమల్లయ్య, కోల లింగయ్య, నర్సయ్య, రాచకొండ మహేశ్వరి, కోల లక్ష్మి, సైదులు, శ్రీనివాస్, రవి, లింగమూర్తి, సైదులు, రవి, ఉపేందర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల వద్ద రైతులు జాగ్రత్త పాటించాలి

హుజూర్‌నగర్ : వ్యవసాయ విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హుజూర్‌నగర్ సీఐ రామ లింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మోటార్లు, స్టార్టర్లకు ఏదైన మరమ్మతులు అవసరమైతే ఎలక్ట్రిషియన్‌ను సంప్రదించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు విద్యుత్ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. గత మూడు రోజుల్లో సర్కిల్ పరిధిలో ముగ్గురు రైతులు కరెంట్ షాక్‌తో మృతి చెందడం బాధాకరమని తెలిపారు.

గురుకులంలో మ్యాజిక్‌షో



గురుకులంలో మ్యాజిక్‌షో నిర్వహిస్తున్న మెజీషియన్ రామకృష్ణ

మఠంపల్లి : విద్యార్థులకు చదువుతో పాటు ఏకాగ్రత ముఖ్యమని ప్రముఖ గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డు హోల్డర్, మెజీషియన్ రామకృష్ణ అన్నారు. మంగళవారం మఠంపల్లిలోని గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఆయన మ్యాజిక్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్‌తో విద్యార్థులకు చెడు అలవాట్లు అలవడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, రేస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పోతబత్తిని శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి అభినందన

హుజూర్‌నగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తాడేపల్లి గూడెంలోని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నృత్య కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి నృత్య మయూరి అవార్డు పొందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని మీనాక్షిని హెచ్‌ఎం వెంకటరమణారావు మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి అన్నదానం ఏర్పాటు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల రెడ్డి అన్నదాన సత్రంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు తరలివచ్చే తెలుగు రాష్ట్రాల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ కన్వీనర్లు సాముల వెంకటేశ్వర్‌రెడ్డి, పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానికంగా జరిగిన సత్ర కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో త్రిపురం అంజన్‌రెడ్డి, శౌరిరెడ్డి, కోటిరెడ్డి, ప్రతాపరెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, చౌదరిరెడ్డి, పాల్గొన్నారు.


కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ అన్నారు. కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన ఆయనను మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ సోహెల్ హుజూర్‌నగర్‌లో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కోదాడరూరల్: అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం రావిరాల ఇసుక రీచ్ నుంచి టిప్పర్‌లో ఇసుకను లోడ్ చేసుకొని రాష్ట్ర సరిహద్దులోని అన్నారం వరకు అనుమతులు తీసుకొని అక్కడి నుంచి అక్రమంగా తెలంగాణలోకి ప్రవేశిస్తుండగా కోదాడ మండలంలోని కాపుగల్లు వద్ద పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్ పూల సైదులు, యజమాని కొట్టె వెంకటనరేంద్రపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



రాష్ట్ర స్థాయి క్రీడల్లో బహుమతి పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

నడిగూడెం : జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి అన్నారు. ఇటీవల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఎం.కావేరి, ఎం.కీర్తన పెద్దపల్లి జిల్లా నందిమేడారంలో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో టెన్నీకాయిట్‌లో ప్రథమ బహుమతి పొందారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుధారాణి, కరిష్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని వల్లాపురం, తెల్లబల్లి గ్రామాల్లో నిర్వహించిన వికసిత భారత సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. అర్హులు కేంద్ర పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దేవబత్తిని వెంకటనర్సయ్య, వట్టికూటి చంద్రయ్య, సిరిపురం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కె.యాదగిరి, బీజేపీ జిల్లా నాయకుడు వంగవీటి శ్రీనివాసరావు, నాయకులు లతీఫ్, బండారు శోభారాణి, రీనా, గుర్వయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణలకు గురైన మున్సిపల్ స్థలాలను ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని, వాటికి హద్దులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ జక్కుల వీరయ్య యాదవ్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణకు గురైన వీపీఆర్ స్థలాలను అదనపు కలెక్టర్ హద్దురాళ్లు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకోవటం శుభపరిణామన్నారు. కొన్ని లర్ల పోరాటం ఫలితంగా మున్సిపాలిటీకి సుమారు రూ.2 కోట్ల విలువైన ఆస్తి వచ్చిందని అన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్

మఠంపల్లి : ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మఠంపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉపాధి హామీ ప్రజావేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో 29 గ్రామ పంచాయతీ ఆవాస ప్రాంతాల్లో 2022 జనవరి 01 నుంచి 2023 మార్చి 31వరకు 1179 ఉపాధి హామీ పనులు చేపట్టి రూ.6 కోట్ల 66 లక్షల 26 వేల 773లు చెల్లించడం జరిగిందన్నారు. దీనిపై 14వ విడత సామాజిక తనిఖీ బృందం ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై విచారణ నిర్వహించినట్లు తెలిపారు. కూలీలకు రూ.4 కోట్ల 35లక్షల 60 వేల 381 చెల్లింపులు, మెటీరియల్‌కు రూ.30 లక్షల 66వేల 392లు అదేవిధంగా ఫారెస్ట్ పనుల్లో రూ.1లక్ష 62 వేల 286లు కూలీలకు చెల్లించగా మెటీరియల్ ద్వారా రూ.1లక్ష 98వేల 712లు చెల్లించినట్లు తెలిపారు. ఈ పనులపై సోషల్ ఆడిట్ బృందం ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి జరిగిన అవకతవకలు, అక్రమాలను ప్రజావేదికలో వెల్లడించారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మామిడి జానకిరాములు, హెచ్‌ఆర్ ప్రవీణ్‌కుమార్, అంబుడ్స్‌మెన్ లచ్చిరామ్‌నాయక్, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు అందించాలి

నేరేడుచర్ల : అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిర అక్షింతలను ఇంటింటికీ అందజేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ కాచం సత్యనారాయణ సూచించారు. మంగళవారం నేరేడుచర్లలోని అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతల కలశాల ఊరేగింపు సన్నాహక సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంచాలక్ అంకతి అప్పయ్యతో కలిసి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హిందూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు ఈ నెల 26వ తేదీన అంక్షితలతో కూడిన కళశాలను ఊరేగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం కర సేవకులు తాళ్ల రమేష్, పారేపల్లి అశోక్, ఉరిమళ్ల రామ్మూర్తిలను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి, మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ రాచకొండ రామ్ కోటేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రాంమోహన్‌రావు, ధూపదీప నైవేద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫణికుమార్‌శర్మ, మెట్టు వేణుగోపాల్‌రెడ్డి, కొణతం కృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, సీతారాంరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, శ్రీలత, కోటేశ్వర్‌రావు, మహాలక్ష్మి, మోహన్, శ్రీరామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్, సాయి, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ సత్యనారాయణ

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



నేరేడుచర్ల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

నేరేడుచర్ల : వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ కోటా చలం ఆదేశించారు. నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రికి చెందిన వివిధ రకాల రికార్డులను పరిశీలించి మాట్లాడారు. హోమియోపతి మందులను దీర్ఘకాలిక వ్యాధులకు అందించాలని, గర్భిణులకు ఐరన్ ఎక్కువ ఉండే ఆహారాన్ని అందించాలని కోరారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులు, ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి నాగిని, హోమియో వైద్యాధికారి శృతి, సీహెచ్‌ఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, జయమ్మ, సిబ్బంది త్రినాథ్, జగదీశ్వర్, హేమలత, రమాదేవి పాల్గొన్నారు.

శ్రీనివాసరావు ఆశయాలు సాధించాలి

మునగాల : కమ్యూనిస్టు ఉద్యమంలో అంచెలంచెలుగా ఎదిగి మిలిటెంట్ కార్యకర్తగా ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి పోటు శ్రీనివాసరావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందారు. మంగళవారం నాగార్జునరెడ్డి ఆయన మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు ఆశయసాధనకు ప్రతికార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, ముత్యాలు, వెంకన్న, చందా చంద్రయ్య, షేక్ సైదా, దుర్గారావు, వెంకట్రామయ్య, నందిగామ సైదులు, శంభయ్య, మాజీ సర్పంచ్ వెంకన్న, భిక్షం పాల్గొన్నారు.



శ్రీనివాసరావు మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పిస్తున్న నాగార్జునరెడ్డి

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

చిలుకూరు : మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయంలో మంగళవారం ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో పూజారి సిరికొండ అనంతకృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి, మాలధారులు, భక్తులు, పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయంలో ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, గోత్రనామాలు, సేవాకాలం, ఆళ్వార్లకు మంగళాశాసనం, మూడవ పాశురతాత్పర్యం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవ, తీర్థప్రసాద గోష్టి, ఆరగింపు తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, ధర్మకర్తలు సురభి కుషల్, పూర్ణ, కనకయ్య, మల్లయ్య, అర్చకులు మనోహరాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : పొనుగోడులోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

గరిడేపల్లి మండలంలో..

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు, కీతవారిగూడెం, కల్మలచెరువు గ్రామాల్లో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం గోదాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, లహరి, నరసింహాచార్యులు, రాయపోలు శ్రీరామశర్మ, భద్రశర్మ పాల్గొన్నారు.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాయలంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం చేశారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొరివి కృష్ణస్వామికి నివాళి

కోదాడఅర్బన్ : ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు, హైదరాబాద్ నగర తొలి మేయర్, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జర్నలిస్టు కొరివి కృష్ణస్వామి 56వ వర్ధంతిని మంగళవారం కోదాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ముదిరాజ్ మహాసభ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ నాయకత్వంలోనే ముదిరాజ్ జాతికి గుర్తింపు వచ్చిందన్నారు. కోదాడలో ఆయన విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉపేందర్, నాగమణి, చినరాములు, రామయ్య, సత్తయ్య, వీరబాబు, మట్టయ్య, రమేష్, వెంకన్న, పూర్ణచందర్‌రావు, మల్సూరు, నర్సింహారావు, కోటేశ్వరరావు, నారాయణ, రాంబాబు, రవి, విప్లవరాజు తదితరులు పాల్గొన్నారు.



కొరివి కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోదాడ ముదిరాజ్ సంఘం నాయకులు